సాక్షి
అనంతపురం
శనివారం । 24 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.30 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి. మార్కెట్‌కు 819 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



జిల్లాస్థాయి ఎంపిక పోటీలు
కడపలోని డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్లో 4, 5 తరగతుల్లో ప్రవేశాల కోసం శుక్రవారం అనంతపురం పీటీసీ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. 10లో

గరిష్టం/కనిష్టం
35.2°/22.9°
జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

అర్హుల చెంతకే సంక్షేమం

- జూలై 1 నుంచి ఆగస్టు 1 వరకు 'జగనన్న సురక్ష' కార్యక్రమం
- 663 సచివాలయాల పరిధిలో క్యాంపులు
- ఇంటింటికీ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది
- ఉచితంగా 11 రకాల సేవలు : కలెక్టర్ గౌతమి


కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

అనంతపురం అర్బన్: అర్హత ఉండీ ప్రభుత్వ పథకం అందని వారికి సైతం లబ్ధి చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అతిపెద్ద ప్రాయోజిత కార్యక్రమం 'జగనన్న సురక్ష' అని కలెక్టర్ గౌతమి అన్నారు. జిల్లాలో 'జగనన్న సురక్ష' అమలు గురించి కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డితో కలిసి మీడియాకు వెల్లడించారు. జూలై 1 నుంచి ఆగస్టు 1 వరకు 'జగనన్న సురక్ష'ను ప్రణాళికాబద్ధంగా అమలు చేసేందుకు అన్ని చర్యలూ చేపట్టామన్నారు. జిల్లావ్యాప్తంగా 663 సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రూరల్ పరిధిలోని ప్రతి సచివాలయం పరిధిలో, అర్బన్ పరిధిలో క్లస్టర్ (ఐదు సచివాలయాలు మించకుండా) పరిధిలో అనువైన చోట క్యాంపు నిర్వహిస్తారన్నారు. ఏ రోజున క్యాంపు నిర్వహిస్తారనేది ముందుగానే ప్రజలకు తెలియజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రతి ఇల్లూ సందర్శిస్తారు

'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 11,163 మంది వలంటీర్లు, 4,330 మంది సచివాలయ సిబ్బంది ప్రతి ఇల్లూ సందర్శిస్తారని కలెక్టర్ చెప్పారు. సచివాలయ పరిధిలో క్యాంపు నిర్వహించేందుకు ఏడు రోజుల ముందు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఏ సేవలను ఉచితంగా అందిస్తారనే విషయాన్ని ప్రజలకు తెలియజేస్తారన్నారు. క్యాంపు నిర్వహించే రోజున ప్రజలను తీసుకొచ్చి వారికి కావాల్సిన ధ్రువపత్రాలను మంజూరు చేయిస్తారన్నారు.

ఉచితంగా 11 రకాల సేవలు..

క్యాంపులో 11 రకాల ప్రభుత్వ సేవలను సేవా రుసుం లేకుండా ఉచితంగా అందిస్తారన్నారు. జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ, వివాహ ధ్రువీకరణ పత్రం జారీ, లావాదేవీ మ్యుటేషన్లు, ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం, కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు, కొత్త రేషన్ కార్డు లేదా కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో మార్పులు, చేర్పులు వంటి సేవలను అందిస్తారన్నారు. మ్యుటేషన్ల విషయానికి వస్తే చట్టం ప్రకారం నోటీసు గడువు 14 రోజులు పూర్తయిన తరువాత సమస్య పరిష్కరిస్తారన్నారు. కొత్త రేషన్‌కార్డు, పింఛను మంజూరుకు సంబంధించి అభ్యర్థులను పరిశీలించి ప్రభుత్వానికి పంపిస్తారన్నారు. ప్రభుత్వం ఏటా జూన్, డిసెంబర్‌లో మంజూరు చేస్తుందన్నారు.

నిర్వహణకు మూడు బృందాలు!

'జగనన్న సురక్ష' నిర్వహణకు రెండు లేదా మూడు బృందాలు పనిచేస్తాయని కలెక్టర్ తెలిపారు. తహసీల్దారు, ఈఓపీఆర్‌డీ ఒక బృందం, ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దారు ఒక బృందంగా, పట్టణాల్లో మునిసిపల్ కమిషనర్లు, రెవెన్యూ సిబ్బంది ఒక బృందంగా పనిచేస్తాయన్నారు. ప్రతి నియోజకవర్గానికీ ఒక ప్రత్యేక అధికారి, ప్రతి మండలానికీ ప్రత్యేక అధికారిని నియమించామన్నారు. క్యాంపు నిర్వహించే రోజున ప్రత్యేక అధికారులు అక్కడే ఉండి పర్యవేక్షిస్తారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ముగిసే వరకు పర్యవేక్షణకు జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు.

క్యాంపులో జేకేసీ డెస్క్..

జగనన్న సురక్ష క్యాంపులో జగనన్నకు చెబుదాం (జేకేసీ) డెస్కునూ ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ గౌతమి చెప్పారు. 'జగనన్నకు చెబుదాం'లో వచ్చిన ఫిర్యాదు సంతృప్తికరంగా పరిష్కారం అయ్యిందా లేదా అనేది అర్జీదారుతో మాట్లాడతారన్నారు. సంతృప్తి చెందితే ఫిర్యాదును క్లోజ్ చేసి ఎండార్స్‌మెంట్ ఇస్తారన్నారు. సంతృప్తి చెందలేదంటే ఎందుచేత అనే వివరాలను తెలుసుకుని నమోదు చేస్తారన్నారు. సంతృప్తస్థాయి పరిష్కారం చూపేందుకు ఫిర్యాదును రీ–ఓపెన్ చేస్తారన్నారు.

అర్హులందరికీ లబ్ధి


వీసీలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలు అందించనున్నట్లు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేలా చిత్తశుద్ధితో కార్యక్రమం అమలు చేయాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నెల రోజుల పాటు నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి లాంఛనంగా ప్రారంభించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

- రాష్ట్రంలో 16వ స్థానంలో నిలిచిన అనంతపురం
- 12,369 మంది విద్యార్థులకు గాను 7,403 మంది ఉత్తీర్ణత
- 29 లోగా రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి



రాప్తాడురూరల్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లాలో 59.95 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలోని మన జిల్లా 16వ స్థానంలో నిలిచింది. ఈ నెల 2 నుంచి 10 వరకు ఈ పరీక్షలు జరిగాయి. జిల్లాలో మొత్తం 12,349 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 7,403 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలికలు 4,915 మందికి గాను 3,272 మంది (66.57 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురు 7,434 మందికి గాను 4,131 మంది (55.57 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ నెల 29లోగా జవాబు పత్రాల రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ సాయిరామ్ తెలిపారు. సీఎఫ్ఎంఎస్ సిటిజన్ చలాన్ ద్వారా ఒక్కో సబ్జెక్టుకు రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. జవాబుపత్రాల రీ వెరిఫికేషన్ కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చెల్లించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు డౌన్‌లోడ్ చేసుకున్న పదో తరగతి మార్కుల జాబితా, విద్యార్థి హాల్‌టికెట్‌పై హెచ్ఎం సంతకం చేయించి అనంతపురంలోని కేఎస్ఆర్ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటరులో ఈ నెల 30న అందజేయాలని డీఈఓ తెలిపారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటింటి సర్వే

అనంతపురం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం అమలులో భాగంగా ముందుగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన కీలక డాక్యుమెంట్లకు కావాల్సిన ఆధారాల సేకరణ ప్రక్రియ శనివారం నుంచి మొదలుకానుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11,028 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఉద్యోగులు, వలంటీర్లు రంగంలోకి దిగనున్నట్లు జెడ్పీ సీఈఓ, గ్రామ, వార్డు సచివాలయ శాఖ నోడల్ ఆఫీసర్ కె.భాస్కర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. వీరంతా ఇంటింటికీ వెళ్లి 'జగనన్న సురక్ష' క్యాంపుల గురించి వివరిస్తారు. ఆ తరువాత వారికి అవసరమైన డాక్యుమెంట్ల జారీకి సంబంధించిన ఆధారాలు సేకరిస్తారు. వాటిని సచివాలయానికి తీసుకెళ్లి సమర్పిస్తారు. టోకెన్ కూడా వలంటీర్లే తీసుకెళ్లి ఇంటి వద్దకు చేరుస్తారు. ఏ తేదీ క్యాంపు నిర్వహిస్తారో ముందుగా తెలియజేస్తారని ఆయన తెలిపారు. క్యాంపు జరిగే రోజు అక్కడికి వెంట పిలుచుకెళ్లి సమస్య పరిష్కారమయ్యే వరకు తోడుగా ఉంటారన్నారు. ఎటువంటి సేవా రుసుము లేకుండా 11 రకాల సేవలు పూర్తి ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు.

ప్రత్యేక లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి


కలెక్టర్, ఎస్పీలతో సమీక్ష నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

అనంతపురం: జూలై 22న నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ కోరారు. ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన శుక్రవారం తన చాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో అనంతపురం కలెక్టర్ గౌతమి, శ్రీసత్యసాయి డీఆర్ఓ కొండయ్య, అనంతపురం ఎస్పీ శ్రీనివాసరావు, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన 1,207 మెట్రిక్ టన్నుల ఎరువులు


ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం 1,207 మెట్రిక్ టన్నులు సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ రవి తెలిపారు. రాప్తాడు ఏఓ వెంకటేశ్వరప్రసాద్‌తో కలిసి ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌లో వ్యాగన్ల ద్వారా వచ్చిన ఎరువులను పరిశీలించారు.

నాణ్యమైన కంకర సరఫరా చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి నాణ్యమైన కంకరను సరఫరా చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ క్వారీ, కంకర ఫ్యాక్టరీ యాజమాన్యాల ప్రతినిధులకు సూచించారు. కంకర సరఫరా అంశంపై జేసీ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గనుల శాఖ డీడీ వెంకటేశులుతో కలిసి జిల్లాలోని క్వారీ, కంకర ఫ్యాక్టరీ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం జగనన్న హౌసింగ్ కాలనీల్లో ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్లకు అవసరమైన 20 ఎంఎం, 12 ఎంఎం, 6 ఎంఎం కంకరతో పాటు డస్టును సకాలంలో సరఫరా చేయాలన్నారు. ఇదివరకు సరఫరా చేసిన వాటికి బిల్లులను సత్వరమే చెల్లిస్తామన్నారు. ఈ క్రమంలో యాజమాన్యాల ప్రతినిధులు మాట్లాడుతూ తాము చెల్లించిన అడ్వాన్స్‌ల నుంచి పర్మిట్‌లు మంజూరు చేయాలని కోరారు. కంకర ఫ్యాక్టరీ యాజమాన్యం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జేసీ హామీ ఇచ్చారు. సమావేశంలో గనుల శాఖ ఏడీ నాగయ్య, విజిలెన్స్ ఏడీ విజయలక్ష్మి, అసిస్టెంట్ జియాలజిస్ట్ రామకృష్ణప్రసాద్, క్వారీ, కంకర యాజమాన్యాల ప్రతినిధులు వెంకటనాయుడు, అశోక్, రాఘవేంద్ర, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఎలుగుబంటి సంచారంతో భయం భయం


కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న డీఆర్వో లక్ష్మప్ప, బీట్ ఆఫీసర్ ఆంజనేయులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బీటీపీ రోడ్డు, హౌసింగ్ లేఅవుట్ తదితర ఏరియాల్లో ఎలుగుబంటి సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తాజాగా గురువారం సాయంత్రం బీటీపీ రోడ్డు రైల్వే గేటు సమీపంలోని ఓ మామిడి తోట వద్ద ఎలుగుబంటి కనిపించింది. కుక్కలు తరమడంతో అక్కడినుంచి సమీపంలో గుట్టలోకి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు గురువారం రాత్రి పరిసర ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించారు. రాత్రిపూట బయటకు వచ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఒంటరిగా తిరగరాదని సూచించారు. ఎలుగుబంటి సంచారంపై గస్తీ నిర్వహిస్తున్నామన్నారు.

'సమగ్ర'లో సిమెంటు దొంగలు

- ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కీలకపాత్ర
- దాదాపు 35 లోడ్ల సిమెంటు పక్కదారి
- ఈఈ, డీఈల అధికారిక లాగిన్‌ల ద్వారా బుకింగ్
- అధికారులకు ఓటీపీ రాకుండా వారి మొబైళ్లకే వచ్చేలా జాగ్రత్తలు
- గుట్టు చప్పుడుకాకుండా విచారణ చేస్తున్న అధికారులు



రాప్తాడు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మన బడి నాడు – నేడు'లో భాగంగా జరుగుతున్న నిర్మాణ పనులకు సబ్సిడీతో సరఫరా అవుతున్న సిమెంట్ సమగ్రశిక్షలో పక్కదారి పట్టింది. దాదాపు 35 లోడ్‌ల దాకా బయట అమ్ముకున్నట్లు తెలిసింది. ఇదంతా ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేశారు. వీరి నిర్వాకం ఇటీవలే బయటపడినా అధికారులు గుట్టుచప్పుడు కాకుండా విచారణ చేస్తున్నారు. నేడో రేపో పూర్తి వివరాలు బయటకు రానున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. నాడు–నేడు పనులకు అవసరమైన సిమెంట్ కావాలంటే ఈఈ, డీఈల అధికారిక లాగిన్ ద్వారా సంబంధిత కాంట్రాక్టర్ల పేరుతో ఏపీ నిర్మాణ్ పోర్టల్‌కు వెళ్లి ఇండెంట్ పెట్టాల్సి ఉంటుంది. ఇండెంట్ పెట్టగానే సంబంధిత ఈఈ, డీఈల మొబైళ్లకు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీ చెప్పిన తర్వాతనే లోడు పంపుతారు. లోడు వచ్చిన తర్వాత సంబంధిత ప్రాంతంలో అన్‌లోడ్ చేయగానే ఇన్‌వాయిస్ (లోడు అందుకున్నట్లు) కాంట్రాక్టర్, అధికారులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇద్దరు చిన్న ఉద్యోగులు ఎవరికీ అనుమానం రాకుండా ఈ తతంగమంతా నడిపించేశారు. అధికారులకు గానీ, కాంట్రాక్టర్లకు గానీ తెలీదు. సిమెంటు మాత్రం లోడ్లు లోడ్లు బుక్ చేస్తున్నారు. వచ్చిన సిమెంటును వచ్చినట్లు బ్లాక్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకున్నారు. మొత్తం సిమెంటును శ్రీసత్యసాయి జిల్లాలో ముగ్గురు కాంట్రాక్టర్ల పేర్లతో బుక్ చేసుకున్నారు.

వారి మొబైళ్లకే ఓటీపీలు..

శ్రీసత్యసాయి జిల్లాలోని వివిధ మండలాల్లో జరుగుతున్న నిర్మాణ పనులకు అవసరమైన సిమెంట్ ఇండెంట్‌ను అక్కడి డీఈ లాగిన్ ద్వారా బుక్ చేసుకోవాల్సి ఉంది. జిల్లా విభజన జరిగిన తర్వాత శ్రీసత్యసాయి జిల్లాకు లాగిన్ ఇవ్వలేదని తెలిసింది. ఇదే లాగిన్ ద్వారానే మొత్తం తతంగం నడిపారు. ఓటీపీ సంబంధిత అధికారులకు వెళ్లకుండా ఆ స్థానంలో వీరి మొబైల్ నంబర్లు పెట్టుకున్నారు. కాంట్రాక్టర్‌కు తెలీకపోయినా ఆయన పేరుమీద బుక్ చేశారు. బుక్ చేయగానే వీరి మొబైళ్లకు ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేసిన తర్వాత లోడ్లు వచ్చాయి. వాటిని అప్పటికే వీరు మాట్లాడుకున్న వారివద్దకు పంపారు. ఇక్కడ లోడు తీసుకొచ్చిన డ్రైవర్లను 'మేనేజ్' చేశారు. సబ్సిడీ సిమెంటు ఓపీసీ రకం బ్యాగు రూ. 270, పీపీసీ రకం రూ.280కు అందిస్తున్నారు. దీన్ని బయట ఒక్కో బ్యాగు రూ.40–50 వరకు అధికంగా అమ్ముకున్నట్లు తెలిసింది. ధర్మవరం ప్రాంతంలో ఎక్కువగా అమ్మకాలు చేసినట్లు సమాచారం.

కాంట్రాక్టర్ల అప్రమత్తతతో వెలుగులోకి..

ముగ్గురు కాంట్రాక్టర్ల పేర్ల మీద వీరి వ్యవహారం నడిపారు. వీరిలో ఒక కాంట్రాక్టర్ ఏడాదికింద శ్రీసత్యసాయి జిల్లాలో పనులు చేశారు. అయితే ఆయన పేరుమీద ఇటీవలే 12 లోడ్ల దాకా బుక్ చేసినట్లు తెలిసింది. జీఎస్టీ సమస్య రానుండడంతో అప్రమత్తమైన ఆయన సమగ్ర శిక్ష అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. తాను ఎక్కడా పనులు చేయడం లేదని, అయినా తనపేరుతో సిమెంట్ బుక్ చేశారని చెప్పడంతో అధికారులకు అనుమానం వచ్చింది. మరో ఇద్దరు కాంట్రాక్టర్ల పేర్ల మీద కూడా ఇదే విధంగా బుక్ చేశారు. దాదాపు ఏడాది నుంచి వీరి దందా సాగుతోంది. అనుమానం వచ్చిన అధికారులు లోతుగా విచారణ చేయడంతో ఆ ఇద్దరి ఉద్యోగుల అక్రమాలు బయటపడ్డాయి. అయితే ఈ విషయం బయట పడకుండా లోగుట్టుగా విచారణ సాగిస్తున్నారు.

ఈఈ శివకుమార్ ఏమంటున్నారంటే...

'శ్రీసత్యసాయి జిల్లాలో జరుగుతున్న 'నాడు–నేడు' పనుల కోసం ఈఈ, డీఈలకు తెలీకుండా వారి లాగిన్లద్వారా ఇద్దరు ఉద్యోగులు సిమెంట్ బుక్ చేసిన మాట వాస్తవమే. ఓటీపీలు మాకు రాకుండా వారి నంబర్లనే పెట్టుకున్నారు. కాంట్రాక్టర్ల పేర్లతో వారికి తెలీకుండా కొన్ని లోడ్లు బుక్ చేశారు. అవి ఎక్కడ అమ్మారు...ఎన్ని లోడ్లు బుక్ చేశారు తదితర అంశాలపై విచారణ చేస్తున్నాం. పూర్తవగానే కలెక్టర్ గౌతమి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం'.

'ఆదరణ' బాధితుల ఆక్రందన

- దారి మళ్లిన రూ.50 కోట్ల సొమ్ము!
- ప్రాథమిక విచారణ చేపట్టిన త్రీమెన్ కమిటీ
- రూ.15 కోట్ల సొమ్ము కోసం డాక్యుమెంట్లతో వచ్చిన బాధితులు


అధికారికి వినతిపత్రాలు అందజేస్తున్న ఆదరణ బాధితులు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: ఆదరణ చిట్‌ఫండ్స్ బాధితులు త్రీమెన్ కమిటీ ముందు ఆక్రందనలు చేశారు. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, విశ్రాంత జీవన సమయంలో అక్కరకు వస్తుందన్న ఉద్దేశంతో పైసా పైసా కూడబెట్టి సంస్థపై నమ్మకంతో చిట్స్ వేశామని, డిపాజిట్ చేశామన్నారు. తమ కష్టార్జితాన్ని దోచుకోవాలని చూస్తే మట్టికొట్టుకుపోతారంటూ సంస్థ నిర్వాహకులకు శాపనార్థాలు పెట్టారు. అనంతపురంలోని ఆదరణ చిట్‌ఫండ్స్‌లో సభ్యులుగా చేరి డిపాజిట్ చేసిన వారికి మెచ్యూరిటీ తేదీ దాటిపోయినా సంస్థ తిరిగి డబ్బు చెల్లించలేదు. చిట్స్, డిపాజిట్లకు సంబంధించి రూ.50 కోట్లు దారి మళ్లినట్లు తెలుస్తోంది. ఈ సొమ్ముతో కర్ణాటక రాజధాని బెంగళూరు సమీపంలో భారీ వెంచర్లు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. కస్టమర్ల నుంచి డబ్బు కోసం ఒత్తిడి పెరుగుతుండటంతో సంస్థ బోర్డు తిప్పేయడానికి రంగం సిద్ధం చేసుకుంది. విషయం తెలుసుకున్న బాధితులు తమ డబ్బు కోసం సంస్థ –పోలీసుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో 'మోసాల ఆదరణ' శీర్షికతో శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా సహకార అధికారి ఎం.ప్రభాకరరెడ్డి ఆదేశాలతో త్రీమెన్ కమిటీ సభ్యులు విచారణ నిమిత్తం 'ఆదరణ' కార్యాలయానికి వచ్చారు. అప్పటికే వందలాదిమంది బాధితులు అక్కడికి చేరుకున్నారు. గంట వ్యవధిలోనే రూ.15 కోట్ల సొమ్ము తమకు తిరిగి రావాలని చిట్స్/డిపాజిట్‌దారులు ఆధారాలతో కూడిన డాక్యుమెంట్లను త్రీమెన్ కమిటీలోని అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలగంగాధర్‌కు అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా చిట్‌ఫండ్స్ నడుపుతున్నా, బాధితులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకుండా ఇప్పటి వరకు ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శించారంటూ త్రీమెన్ కమిటీపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండీ హంపాపురంలోని తన ఫామ్ హౌస్‌లో సేద తీరుతుంటే.. ఆయన భార్య ఆదరణ సంస్థ కార్యాలయంలో ఉండి బాధితులను బెదిరించడానికి, నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నారని విరుచుకుపడ్డారు. ఇదిలా ఉండగా డీఎస్పీ ప్రసాద్ రెడ్డి తన కార్యాలయానికి రావాలంటూ బాధితులకు కబురు పంపారు.

డిపాజిట్ సొమ్ము కాజేశారు

రిటైర్డ్ అయ్యాక వచ్చిన సొమ్ముతో కలిపి రూ.15 లక్షలు ఆదరణ చిట్ ఫండ్స్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాను. నాలాంటి ఎందరో డిపాజిట్ చేసిన సొమ్మును నిర్వాహకులు కాజేశారు. మాది కోర్టులు, పోలీసుల చుట్టూ తిరిగి వేచి చూసే వయసు కాదు. పోలీసులు, ఉన్నతాధికారులు స్పందించి మా సొమ్మును తిరిగి ఇప్పించాలి.
– రఫిక్ అహ్మద్, విశ్రాంత తహసీల్దార్

స్పందించే వారేరీ?

నాకు ఇద్దరు కుమార్తెలు. రిటైర్డు అయ్యాక వచ్చిన సొమ్మును 'ఆదరణ' సంస్థలో డిపాజిట్ చేశాను. నాకు రూ.27 లక్షలు రావాలి. జనవరి నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. మా సొమ్ము ఇవ్వాలని అడిగితే ఎవరూ పట్టించుకోవడం లేదు. వారిచ్చే సమాధానం సరిగా లేదు. సొమ్ము కట్టించుకున్నప్పుడు ఏమి చెప్పారో అదే విధంగా మాకు తిరిగి ఇవ్వాలి.
– సురేంద్రకుమార్, విశ్రాంత ఉద్యోగి, అనంతపురం

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఫైలా



అనంతపురం క్రైం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రేషన్, పెన్షన్, ఇళ్ల పట్టాలు, తదితర కార్డులు కావాలంటే అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడటువంటి పరిస్థితి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. తమ ప్రభుత్వంలో గ్రామ స్వరాజ్యం వచ్చిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించారన్నారు. ముఖ్యంగా జేసీఎస్, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య

- చదువు ఇష్టం లేక ఒకరు.. అనారోగ్యంతో మరొకరు..



మృతులు సీమసాదియా, స్వాతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలో వేర్వేరు చోట్ల ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారు. చదువుకోవడం ఇష్టం లేక ఒకరు, అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది మరొకరు ప్రాణాలు తీసుకున్నారు. ఈ ఘటనలతో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామానికి చెందిన ఫక్రుద్దీన్ కుమార్తె సీమసాదియా (17) ఆరు రోజుల కిందట అనంతపురం శివారులోని కళాశాలలో ఇంటర్–బైపీసీ ప్రథమ సంవత్సరంలో చేరింది. తనకు చదవడం ఇష్టం లేదని తల్లిదండ్రులకు పలుమార్లు ఫోన్‌లో తెలిపింది. సరే ఇంటికి తీసుకెళ్తామని ఓదార్చిన తల్లిదండ్రులు వెంటనే రాలేదు. లగేజీ సర్దుకుని ఉన్న సీమసాదియా మనస్తాపానికి గురై శుక్రవారం హాస్టల్‌లో తోటి విద్యార్థులు టిఫిన్ కోసం వెళ్లగా.. తను గది తలుపులు వేసుకుని ఫ్యానుకు ఉరివేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నాల్గో పట్టణ స్టేషన్ సీఐ ప్రతాప్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా కళాశాల యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా విద్యార్థిని చనిపోయిందని పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు.

అనారోగ్యంతో బలవన్మరణం: నగరంలోని నాలుగో రోడ్డులో నివాసం ఉంటున్న తొమ్మిదో తరగతి విద్యార్థిని స్వాతి (14)కి చాలాకాలంగా ఆరోగ్యం బాగోలేదు. ఆస్పత్రిలో చూపించినా కోలుకోలేకపోయింది. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

ఉత్తమ రక్తనిధిగా గుర్తింపు



రక్తదాతను సన్మానిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని రక్తనిధి కేంద్రం వరుసగా మూడోసారి రాష్ట్రంలోనే ఉత్తమ రక్తనిధిగా గుర్తింపు పొందిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని లెక్చరర్స్ గ్యాలరీలో రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో 2022–23 సంవత్సరానికి సంబంధించి ఉత్తమ రక్తదాతలు 18 మందికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ ఉత్తమ రక్తనిధి కేంద్రంగా నిలవడానికి సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మానవత రక్తదాతల సంస్థ అధ్యక్షుడు తరిమెల అమర్నాథ్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు విద్యార్థులు డిబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని బీఎస్సీ ఐదో సెమిస్టర్ రెగ్యులర్, డిగ్రీ ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల్లో మొత్తం నలుగురు విద్యార్థులు డిబార్ అయినట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. అనంతపురం, ధర్మవరంలో ఒకరు చొప్పున, హిందూపురంలో ఇద్దరు విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతుండగా చర్యలు తీసుకున్నామన్నారు.

నేడు అనంతలో ఆధ్యాత్మిక వేడుక

- నగరంలో పూరీ జగన్నాథ రథయాత్ర
- సంప్రదాయ కళారూపాల ప్రదర్శన



పూజలందుకోనున్న సుభద్ర, శ్రీకృష్ణ బలరాములు

అనంతపురం కల్చరల్: అనంతలో పూరీ జగన్నాథ రథయాత్రకు ఇస్కాన్ మందిరం సర్వాంగ సుందరంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పలు రాష్ట్రాల నుంచి కళాకారులు, ఇస్కాన్ మందిరాల ప్రతినిధులు అనంతకు చేరుకుంటున్నారు. ఒకప్పుడు ఉత్తరాదికి పరిమితమైన పూరీ రథయాత్రను 2015లో ఇస్కాన్ మందిరం అనంతలో ఘనంగా నిర్వహించింది. దేశంలోనే అతిపెద్దదైన పూరీ జగన్నాథ రథయాత్రను దూరాభారం వల్ల చూడలేని వారికి వారి ముంగిటకే రథయాత్రను తెచ్చేవిధంగా ఇస్కాన్ ఏర్పాట్లు చేసింది.

రథయాత్ర సాగుతుందిలా..

కళాజాతా, ఆధ్యాత్మిక ప్రవచనాలు, వేద పఠనం నడుమ శ్రీ జగన్నాథ రథయాత్ర శనివారం మధ్యాహ్నం 4 గంటలకు స్థానిక కేఎస్ఆర్ కాలేజ్ సమీపంలో మహా అభిషేకంతో ప్రారంభమవుతుంది. అక్కడ నుంచి నగర పాలక కార్యాలయం, సుభాష్‌రోడ్, టవర్‌క్లాక్, రాజు రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, తిలక్‌రోడ్, గాంధీబజార్, పాతూరు మీదుగా బసవన్నకట్ట నుంచి మళ్లీ సప్తగిరి సర్కిల్, ఆతర్వాత నేరుగా ఇస్కాన్ మందిరం చేరుకుంటుంది. ఇస్కాన్ జీబీసీ చైర్మన్ శ్రీమాన్ రేవంత్ రమణ్‌దాస్ ప్రభు విశిష్ట అతిథిగా విచ్చేసి రథయాత్రను ప్రారంభిస్తారు. ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే, ఎంపీలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు కళాజాతాను ప్రారంభిస్తారు. ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచే కాకుండా దేశవ్యాప్తంగా కేరళ, తమిళనాడు, ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి కళాకారులు అనంతకు విచ్చేసి, తమ సంప్రదాయ కళారూపాలను ప్రదర్శిస్తారు.

అనంత ఖ్యాతి పెంచేలా రథయాత్ర



ప్రపంచ శాంతిని సాధించే దిశగా ఇస్కాన్ మందిరాలు భక్తిమార్గాన్ని ఎంచుకున్నాయి. సమాజాన్ని అంతటినీ ఏకం చేసే ఆధ్యాత్మిక కార్యక్రమాల పరంపర ద్వారా జ్ఞాన ప్రచారం, వసుధైక కుటుంబ నిర్మాణమే ఇస్కాన్ ముఖ్య ఉద్దేశం. ఆ దిశగా సాగే పూరీ జగన్నాథ రథయాత్ర గత సంవత్సరాల్లో పెద్ద ఎత్తున నిర్వహించాం. అనంత ఖ్యాతిని చాటడానికి విఖ్యాత వేడుక సాగుతోంది. కళా విన్యాసాలు కనువిందు చేస్తాయి. అనంత ఆధ్యాత్మిక వేడుకలో భాగస్వాములై ఇస్కాన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ప్రసాదాన్ని స్వీకరించండి.

– దామోదర గౌరంగదాసు, చైర్మన్, ఇస్కాన్ మందిరం

రూ.74 కోట్లతో 37 విద్యుత్ సబ్ స్టేషన్లు

- విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేంద్ర



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ సురేంద్ర

కణేకల్లు: ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ.74 కోట్లతో 37 కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేంద్ర తెలిపారు. లోఓల్టేజీ, ఓవర్ లోడ్‌ను నియంత్రించి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు 33/11 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కణేకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను కళ్యాణదుర్గం డివిజన్ డీఈఈ శేషాద్రినాయుడుతో కలిసి ఎస్ఈ శుక్రవారం సందర్శించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాణ్యమైన విద్యుత్ అందించాలన్న లక్ష్యంతో మొదటి విడతలో 37 కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేశారన్నారు. ఒక్కో సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. రెండో విడతలో మరో 28 సబ్‌స్టేషన్ల మంజూరు కానున్నాయన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో వీరాపురం, రాయదుర్గం పట్టణంలోని శాంతినగర్‌లో కొత్త సబ్‌స్టేషన్లు నిర్మాణదశలో ఉన్నాయన్నారు. రెండో విడతలో యర్రగుంట, డి.హోన్నూరుకు సబ్‌స్టేషన్లు మంజూరు కానున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో 2022–23 సంవత్సరంలో 21,070 వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. 430 కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 2023–24లో 3,020 వ్యవసాయ కనెక్షన్లు మెటీరియల్ రిలీజ్ చేసినట్లు తెలిపారు. మరో 2,958 సర్వీసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

నెలలో కనెక్షన్లు ఇచ్చేలా చర్యలు...

వ్యవసాయ కనెక్షన్ల కోసం రైతులు విద్యుత్‌శాఖ కార్యాలయం చుట్టూ తిరిగి, ఇబ్బందులు పడకూడదని దరఖాస్తు చేసుకొన్న నెలలో కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ చేపడుతున్నట్లు ఎస్ఈ సురేంద్ర తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ప్రతి నెలా 1,500 మంది వ్యవసాయ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రైతులు ఇబ్బందులు పడకుండా పెండింగ్ కనెక్షన్లను సత్వరమే రిలీజ్ చేసి పనులు శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉమ్మడి అనంత జిల్లాలో రూ.462 కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నట్లు తెలిపారు. 421 జగనన్న కాలనీల్లో విద్యుత్‌లైన్ల ఏర్పాటు పనులు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. విలేకరుల సమావేశంలో ఏఈఈ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

జెడ్పీలో పదోన్నతుల జాబితా సిద్ధం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ పరిధిలో పని చేసే పరిపాలనాధికారులు (ఏఓ)ల పదోన్నతుల వ్యవహారం కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయింది. పదోన్నతుల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూసేవారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చాక పదోన్నతుల విషయంపై ప్రభుత్వం దృష్టి సారించింది. అన్ని కేడర్ల వారికి పదోన్నతులు కల్పిస్తోంది. ఇందులో భాగంగానే జిల్లా పరిషత్ పరిధిలో పని చేసే ఈఓలు చాలా మంది ఇప్పటికే పదోన్నతులు పొందారు. తాజాగా మరికొందరికి పదోన్నతి కల్పించేందుకు జెడ్పీ అధికారులు కసరత్తు చేశారు. ఏడెనిమిది మంది ఈఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పించేందుకు అవసరమైన నివేదికను జెడ్పీ అధికారులు రూపొందించారు. చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అనుమతి కోసం నివేదిక పంపారు. ఆమె పరిశీలించి, అనుమతి ఇవ్వగానే వారందరికీ ఎంపీడీఓలుగా పదోన్నతులు దక్కనున్నాయి. ఈ ప్రక్రియ మూడు, నాలుగు రోజుల్లో పూర్తి కానున్నట్లు జెడ్పీ వర్గాలు తెలిపాయి.

లక్ష్మీనృసింహుడికి ఎస్పీ ప్రత్యేక పూజలు



లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకుంటున్న ఎస్పీ శ్రీనివాసులు

ఉరవకొండ: జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెన్నహోబిళం లక్ష్మీ నృసింహస్వామిని జిల్లా ఎస్పీ శ్రీనివాసులు శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ఎస్పీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ ఆలయ ధ్వజస్తంభం, లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను ఎస్పీకి అర్చకుడు బాలాజీ స్వామి వివరించారు. ఎస్పీకి ఆలయ ఈవో విజయ్ తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ హరినాథ్, ఎస్ఐ వెంకటస్వామిలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన ఆంజనేయులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై అంబేడ్కర్ సర్కిల్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంజనేయులు (32) మృతిచెందాడు. ఎస్ఐ శ్రీధర్ తెలిపిన మేరకు..అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన సారాయి ఆంజనేయులు బండల ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. లారీలో బండలు దింపేందుకు బెంగళూరుకు వెళ్లాడు. శుక్రవారం రాత్రి బెంగళూరులో బండలు దింపి తిరిగి వచ్చే క్రమంలో తోటి కార్మికులతో గొడవ పడి అర్ధరాత్రి చెన్నేకొత్తపల్లిలో లారీ నుంచి దిగేశాడు. అంబేడ్కర్ సర్కిల్లో రోడ్డు దాటుతున్న అతన్ని గర్తు తెలియని వాహనం ఢీకొనింది. తీవ్ర గాయాలైన అతన్ని స్థానికులు 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

26న సచివాలయ ఉద్యోగుల బదిలీలు

అనంతపురం క్రైం: నగర పాలక సంస్థ కార్యాలయంలో ఈ నెల 26న అంతర్ జిల్లాల పరిధిలో సచివాలయ ఉద్యోగుల బదిలీలను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వాప్, మ్యూచువల్ పద్ధతిలో బదిలీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతపురం నగర పాలక సంస్థతో పాటు జిల్లాలోని వివిధ మునిసిపాలిటీల్లో విధులు నిర్వర్తించే అడ్మిన్, ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్, శానిటేషన్ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కార్యాలయ నూతన భవనంలో, ప్లానింగ్, అమినిటీ సెక్రటరీలకు కౌన్సిల్‌హాలులో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సిమెంట్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

అనంతపురం సిటీ: రహదారులు, ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాలకు అవసరమైన సిమెంట్ కోసం కాంట్రాక్టర్లు, వెండర్లు వైఎస్సార్ నిర్మాణ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ (ఎస్ఈ) యమ్మాని భాగ్యరాజ్ శుక్రవారం తెలిపారు. మార్కెట్‌లో బస్తా సిమెంట్ ధర రూ.400కు పైబడి పలుకుతోందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్య భవనాలు, రహదారుల నిర్మాణానికి కోసం కాంట్రాక్టర్లు, వెండర్లకు సర్కారు రూ.270కే సిమెంట్ సరఫరా అవుతుందన్నారు. కాంట్రాక్టర్లు లేదా వెండర్లు తమ పాన్‌కార్డు, ఆధార్ కార్డు, జీఎస్టీ, బ్యాంక్ ఖాతా నంబర్ వివరాలన్నీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. 27 టన్నులు లేదా 32 టన్నుల లోడు కోసం ముగ్గురు లేదా నలుగురు కాంట్రాక్టర్లు కలసి బుక్ చేసుకోవచ్చన్నారు.

పేదవారికి రక్ష..‘జగనన్న సురక్ష’

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



కళ్యాణదుర్గం: జగనన్న సురక్ష కార్యక్రమం పేద వారికి రక్షగా ఉంటుందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. శుక్రవారం జగనన్న సురక్ష పథకంపై మంత్రి ‘సాక్షి’తో మాట్లాడారు. దేశంలో ఎక్కడా కనీవినీ ఎరుగని రీతిలో పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పథకాన్ని ప్రారంభించారన్నారు. ప్రతి ఒక్కరూ పకడ్బందీగా పథకాన్ని అమలు చేసి, ప్రజా సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. ఈ నెల 24 నుంచి సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, జూలై 1 నుంచి సచివాలయాల వద్ద నాలుగు వారాల పాటు ప్రత్యేక క్యాంపులు నిర్వహణ, అన్ని రకాల వినతులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయాల పరిధిలో ప్రజలకు అందుతున్న 11 రకాల సేవలకు సర్వీస్ ఛార్జీలు ఉచితంగా అందించేందుకు వైఎస్సార్‌సీపీ మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. పేదలకు అందించే ప్రభుత్వ సర్వీసుల ఛార్జీలు భారం కాకూడదని ముందడుగు వేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 600కు పైగా పౌర సేవలు సచివాలయాల ద్వారా అందిస్తున్నామన్నారు. అర్హత మాత్రమే పరిగణలోకి తీసుకున్నామని, కులం, మతం, పార్టీ అనేది చూడకుండా పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఎక్కడా కూడా రూపాయి లంచం ఇచ్చే అవసరం లేకుండా పారదర్శకంగా సేవలు అందిస్తున్నామని చెప్పారు.

విద్యార్థుల్లో సేవాగుణం అలవడాలి

- జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: విద్యార్థుల్లో సేవాగుణం అలవడేలా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో యూత్ రెడ్ క్రాస్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థతో కలిసి సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం చాలా అరుదుగా వస్తుందన్నారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లోని విద్యార్థులు జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ విభాగంలో సభ్యత్వం తీసుకొని రెడ్ క్రాస్ నిర్వహించనున్న సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా యాజమాన్యాలు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యాశాఖల అధికారులు, విశ్వవిద్యాలయాల అధికారులు తమ పరిధిలోని అన్ని విద్యాసంస్థల విద్యార్థులను జూనియర్, యూత్ రెడ్ క్రాస్ విభాగాల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ ద్వారా ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రక్తదానం చేయగలిగే వయసున్న విద్యార్థులతో ఏడాదికి కనీసం రెండు దఫాలు రక్తదానం చేయించేలా యాజమాన్యాలు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమానికి రెడ్‌క్రాస్ నోడల్ ఏజెన్సీగా పరిగణించాలని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ డీఈఓ పద్మప్రియ, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి వెంకటరామణనాయక్, రెడ్ క్రాస్ సంస్థ వైస్ చైర్మన్ డాక్టర్ లక్ష్మణప్రసాద్, కార్యదర్శి హరిణిరెడ్డి, మోహన్‌కృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన అక్విడెక్ట్ మరమ్మతులు

- హెచ్చెల్సీ ఈఈ ఎం.వెంకటరమణారెడ్డి



159 కిలో మీటర్ వద్ద దెబ్బతిన్న అక్విడెక్ట్‌ను పరిశీలిస్తున్న హెచ్చెల్సీ ఈఈ ఎం.వెంకటరమణరెడ్డి

కణేకల్లు/బొమ్మనహాళ్: తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ పరిధిలోని ఎస్.హనుమాపురం గ్రామ శివారులో 159 కిలోమీటర్ వద్ద అక్విడెక్ట్ స్లాబ్ మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నట్లు హెచ్చెల్సీ ఈఈ ఎం.వెంకటరమణారెడ్డి తెలిపారు. తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువను కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ డీఈఈ గోపాల్‌నాయక్, ఏఈఈ అల్తాఫ్‌తో కలిసి ఈఈ శుక్రవారం పరిశీలించారు. వివిధ డిస్ట్రిబ్యూటరీల్లో ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులను ఆయన పరిశీలించారు. మొత్తం డిస్ట్రిబ్యూటరీల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు చేయించాలని డీఈఈ, ఏఈఈలకు ఆదేశించారు. అనంతరం 159 కిలో మీటర్ వద్ద అక్విడెక్ట్‌ను పరిశీలించిన ఆయన..స్లాబ్ పూర్తిగా దెబ్బతినిందని, నీరు భారీగా వృథా అయ్యే అవకాశం ఉందన్నారు. దీని మరమ్మతు కోసం ప్రతిపాదనలు తక్షణమే పంపాలన్నారు. అనంతరం ఆయన 150 కిలోమీటర్ వద్ద పడిన రంధ్రాన్ని పరిశీలించారు. దీన్ని వెంటనే పూడ్చాలని ఈఈ అధికారులను ఆదేశించారు. డ్యాం పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు లేక ఇన్‌ఫ్లో రావడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ గోపాల్‌నాయక్, జేఈలు పాల్గొన్నారు.

నాణ్యతకు మారుపేరు భారతి సిమెంట్



కాంక్రీట్, వాటర్ టెస్టింగ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న భారతి సిమెంట్ కంపెనీ ప్రతినిధులు

అనంతపురం రూరల్: నాణ్యతకు మారుపేరు భారతి సిమెంటు అని ఆ కంపెనీ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం అనంతపురంలో కాంక్రీట్, వాటర్ టెస్టింగ్ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ అత్యుత్తమ కట్టడాలకు నాణ్యమైన సిమెంట్ భారతి సిమెంటు అని పేర్కొన్నారు. కట్టడాల్లో కాంక్రీట్ కోసం ఎంత మోతాదులో సిమెంట్ వాడాలో భవన నిర్మాణ కార్మికులకు అవగాహన కల్పించడంతో పాటు భవనాల పటిష్టతను పరిశీలించడానికి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. తమ కంపెనీ ప్రతినిధులు భవన నిర్మాణాలు చేపట్టే దగ్గరికే వెళ్లి నిర్మాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కార్మికులకు, యజమానులకు వివరిస్తారన్నారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ కంపెనీ టెక్నికల్ చీఫ్ మేనేజర్ ఓబులరెడ్డి, డిప్యూటీ మేనేజర్ శివకుమార్, అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ సుబ్బరాయుడు, టెక్నికల్ మేనేజర్ మోతీలాల్ నాయక్, డీలర్లు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీతో నేరగాళ్ల ఆటకట్టు

- నేర సమీక్షలో జీఆర్‌పీ ఎస్పీ కే చౌడేశ్వరి



ప్రశంసాపత్రం అందిస్తున్న జీఆర్‌పీ ఎస్పీ చౌడేశ్వరి

గుంతకల్లు: ఆధునిక టెక్నాలజీతో నేరగాళ్ల ఆట కట్టించనున్నట్లు గుంతకల్లు రైల్వే జీఆర్‌పీ ఎస్పీ కే చౌడేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక గుంతకల్లు రైల్వే పోలీసు జిల్లా కార్యాలయంలో డివిజన్ పరిధిలోని జీఆర్‌పీ పోలీసులతో నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జీఆర్‌పీ ఎస్పీ మాట్లాడుతూ వేసవి కాలంలో రైళ్లలో చోరీల నియంత్రణకు ప్రత్యేక కార్యచరణ రూపొందిచడం ద్వారా నేరాలను అదుపు చేయగలిగామన్నారు. రైళ్లలోను, ప్లాట్‌ఫారంలు, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో సస్పెక్ట్ మానిటరింగ్ సిస్టం, ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ నెట్‌వర్క్ సిస్టం, జైల్ రిలీజ్ మానిటరింగ్ సిస్టం తదితర ఆధునిక టెక్నాలజీని ఉపయోగించినట్లు తెలిపారు. ఈ విధానాల ద్వారా అనుమానితుల ఫింగర్ ప్రింట్స్ సేకరించంతోపాటు అతని ఫొటో తీసుకుంటామన్నారు. దీంతో పాతనేరస్తులు ఉంటే వారి నేరచరిత్ర ఈ టెక్నాలజీ ద్వారా బయటపడుతుందన్నారు. ముఖ్యమైన నేరాలకు పాల్పడిన నేరస్తుల గ్యాంగ్‌ల కార్యకలాపాలు, వారిపై ఉన్న కేసుల విచారణ పురోగతిపై చర్చించారు. పరారీలో ఉన్న నేరస్తులను పట్టుకోవాలని, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వారికి శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ–యాప్‌ల ద్వారా నేరాలను అదుపు చేయడంలో కృషి చేసిన 48 మందిని అభినందిస్తూ గుడ్ సర్వీస్ ఎంట్రీ పేరిట రివార్డులను ఎస్పీ చౌడేశ్వరి అందించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.శ్రీనివాసులు, డీఎస్పీలు అబ్దుల్ అజీజ్ (గుంతకల్లు), షేక్ షాను (తిరుపతి), పి.మల్లికార్జున (నెల్లూరు)లతోపాటు డివిజన్ పరిధిలోని సీఐ, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

అనంతపురం: డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ కడపలో 2023–24 విద్యా సంవత్సరానికి 4,5వ తరగతిలో అడ్మిషన్ల కోసం జిల్లా స్థాయి ఎంపిక పోటీలు పీటీసీ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించారు. 5వ తరగతికి నలుగురు బాలురు, ముగ్గురు బాలికలు, 4వ తరగతికి ఐదుగురు బాలురు, ఇద్దరు బాలికలు పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపిక కాబడిన క్రీడాకారులు ఈ నెల 29, 30వ తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని, ఎంపికైన వారికి స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్లు కల్పించనున్నారు.

దొంగకు దేహశుద్ధి



కళ్యాణదుర్గం రూరల్: పాపంపల్లిలో గ్రామస్తులు దొంగకు దేహశుద్ధి చేశారు. శుక్రవారం వేకువజామున కుర్లకుంట పాలన్న ఇంట్లో చోరీకి యత్నించాడు. పాలన్న కుటుంబ సభ్యులు గట్టిగా కేకలు వేశారు. దీంతో చుట్టుపక్కల వారు దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసి, కళ్యాణదుర్గం పోలీసులకు సమాచారం ఇచ్చారు. 15 రోజుల క్రితం కూడా గ్రామంలో గొర్రెలు ఎత్తుకెళ్లారు. ఇటీవల రాత్రి పూట నిద్రిస్తున్న సమయంలో పలువురి సెల్‌ఫోన్లు చోరీ అయ్యాయి. వరుస దొంగతనాలతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులకు మేలు చేసేందుకే 'జగనన్న సురక్ష'

రాప్తాడురూరల్: అర్హులకు మేలు చేసేందుకు 'జగనన్న సురక్ష' కార్యక్రమం వేదికగా మారాలని నగర మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. శుక్రవారం నగరంలోని 53వ సచివాలయంలో వలంటీర్లు, గృహసారథులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏవైనా కారణాల వల్ల అర్హులకు సంక్షేమ పథకాలు అందనట్లయితే వారికి న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజల వద్దకు నేరుగా వలంటీర్లు, సచివాలయ గృహసారథులు వెళ్లి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అనిల్ కుమార్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వలంటీర్లు, గృహసారథులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

విజయవంతం చేయండి

అనంతపురం క్రైం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమ పర్యవేక్షణ బృందాలు, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 11 రకాల సేవలు, ధ్రువీకరణ పత్రాల జారీకి ఎలాంటి సర్వీసు చార్జీలూ వసూలు చేయకూడదన్నారు. వచ్చే నెల 1 నుంచి సచివాలయాల వారీగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నామన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది శనివారం నుంచే ఇంటింటికీ వెళ్లి కార్యక్రమం గురించి వివరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ రకాల వ్యక్తిగత ధ్రువీకరణ పత్రాల జారీకి వినతులను, అవసరమైన ప్రతాలను సేకరించాలన్నారు. ఏ రోజు ఏ సచివాలయం పరిధిలో క్యాంపు నిర్వహిస్తున్నారో ముందస్తుగా స్థానికులందరికీ తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, కార్యదర్శి సంఘం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రుద్రంపేట సర్పంచ్ పద్మావతి అన్నారు. శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి నరసింహారెడ్డి, సచివాలయ కన్వీనర్లు నారాయణ రెడ్డి, విజయ్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన కల్పించాలి

రామగిరి: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం గురించి ప్రజలందరికీ తెలియజేయాలని పేరూరు సర్పంచ్ రాజేష్ వలంటీర్లకు సూచించారు. శుక్రవారం ఆయన పేరూరు సచివాలయ సిబ్బందితో పాటు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు ఆరా తీయాలన్నారు. అలాగే ఏదైనా ధ్రువీకరణ పత్రం పొందడంలో ఇబ్బందులుంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. సంక్షేమ పథకాలకు అర్హత ఉండీ అందుకోలేని వారిని గుర్తించి పథకాలు అందేలా చూడాలన్నారు.

షెడ్యూల్ విడుదల

ఆత్మకూరు: 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని మండలంలో పకడ్బందీగా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ రోజూ ఒక్కో గ్రామ సచివాలయ పరిధిలో మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో కార్యక్రమం ఉంటుందన్నారు. సమస్యలున్నా, ధ్రువపత్రాలు కావాలన్నా అక్కడికక్కడే పరిష్కారానికి అధికారులు కృషి చేస్తారన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమ షెడ్యూల్‌ను ఆయన విడుదల చేశారు. 1న బి.యాలేరు, 4వ తేదీ సనప, 7వ తేదీ వేపచెర్ల, 11వ తేదీ మదిగుబ్బ, 13వ తేదీ ఆత్మకూరు-2, 15వ తేదీ తోపుదుర్తి, 18వ తేదీ తలుపూరు, 20వ తేదీ ఆత్మకూరు-1, 22వ తేదీ పంపనూరు, 25వ తేదీ పి.యాలేరు, 27వ తేదీ ముట్టాల సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, తహసీల్దార్ షర్మిల, ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, ఏపీఓలు సుజాత, పుష్ప, హౌసింగ్ ఏఈ శ్రీధర్, ఏపీఎం మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెరుగైన సేవలందించాలి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న అధికారులు

ఆత్మకూరు: సచివాలయ ఉద్యోగులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ షర్మిల, ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ సూచించారు. శుక్రవారం వారు ఎంపీపీ సుబ్బర హేమలతతో కలిసి మండల కేంద్రంలోని ఆత్మకూరు-2 గ్రామ సచివాలన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. 'జగనన్న సురక్ష' కార్యక్రమం గురించి గ్రామ వలంటీర్ల ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ పథకాల విషయంలో నిర్లక్ష్యం చేయరాదని, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, తహసీల్దార్

ఆత్మకూరు: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయలోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీపీ సుబ్బర హేమలత, ఎంపీడీఓ విజయ్ ప్రసాద్, తహసీల్దార్ షర్మిల సూచించారు. శుక్రవారం వారు స్థానిక కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తింటున్న భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా..? భోజనం రుచిగా ఉందా..? ఏమైనా సమస్యలున్నాయా అని విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ రోజూ తాజా కూరగాయలతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాల సమస్యలపై ఆరా తీయగా, నీటి సమస్య ఉన్నట్లు ప్రిన్సిపాల్ లీమా రోజ్ తెలిపారు. దీంతో ఎంపీడీఓ వెంటనే పంచాయతీ సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

జీవాలకు నట్టల నివారణ మందులు తాగించాలి



ముట్టాలలో జీవాలకు మందులు వేస్తున్న పశువైద్య సిబ్బంది

ఆత్మకూరు: జీవాలు రోగాల బారిన పడకుండా నట్టల నివారణ తాగించాలని పశువైద్యాధికారి తులసీరామ్ సూచించారు. ఈనెల 30వ తేదీ వరకూ నట్టల నివారణ మందు అందిస్తామన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ముట్టాల గ్రామంలో జీవాలకు నట్టల నివారణ మందులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపాలమ్మ మాట్లాడుతూ, గొర్రెలు, మేకలున్నవారు తప్పని సరిగా మందు వేయించాలన్నారు.

ఏఓగా తారా మోహన్‌రావు బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్రైం: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ పరిపాలనాధికారి(ఎఫ్ఏసీ)గా కె.తారామోహన్ రావు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఏఓగా ఉన్న ప్రభాకర్ మోసెస్ కర్నూలులోని శిక్షణ కళాశాలకు బదిలీ అయ్యారు. దీంతో డీఎంహెచ్ఓ కార్యాలయంలో సర్వీస్ ఇంజినీర్‌గా ఉన్న తారామోహన్ రావుకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి ఉత్తర్వులు జారీ చేశారు.

గోరింట అలంకారంలో వాసవీమాత



పూజలందుకున్న వాసవీ మాత

అనంతపురం కల్చరల్: ఆషాఢమాస శుక్రవారాన్ని పురస్కరించుకుని కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గోరింట అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ నెల 27 వరకు జరగనున్న వారాహి నవ రాత్రుల వేడుకల్లో భాగంగా సాయంత్రం వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు నిర్మలాదేవి ఆధ్వర్యంలో అమ్మవారికి సహస్ర నామార్చనలు గోరింటాకు పొడితో నిర్వహించారు. రెండు వందల మందికి పైగా భక్తులు సామూహిక అర్చనలో పాల్గొని అమ్మవారిని ఆరాధించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆషాఢమాసం అమ్మవారికి ప్రీతి పాత్రమైనదని, అందువల్ల ఒక్కో శుక్రవారం ఒక్కో అలంకారంలో పూజిస్తామని తెలిపారు.

యువకుల హల్‌చల్

- తమ కారుకు బైక్ తగిలిందని ఓ వ్యక్తిపై దాడి
- ఫోన్ పే ద్వారా బలవంతంగా డబ్బు వేయించుకున్న వైనం
- ముదిగుబ్బలో ఓ ఆటోను కారుతో ఢీ కొట్టిన యువకులు
- అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్న పోలీసులు



పోలీసుల అదుపులో ఉన్న యువకులు

ముదిగుబ్బ: వాహనానికి పోలీస్ సైరన్ బిగించుకుని హల్‌చల్ చేసిన యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే..అనంతపురం ఆర్టీఓ కార్యాలయంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న కొండప్ప కుమారుడు దిలీప్ తన స్నేహితులు కార్తీక్, బాబా ఫరూఖ్, భాస్కర్, మరో యువకుడితో కలిసి శుక్రవారం ఇన్నోవా వాహనంలో బట్రేపల్లి వాటర్ ఫాల్స్ వద్దకు వెళ్లారు. అక్కడ ఆనందంగా గడిపారు. అనంతరం కదిరికి వెళ్లారు. కదిరి నుంచి ముదిగుబ్బ వైపు వస్తుండగా, మార్గమధ్యలో కాళసముద్రం వద్ద స్పీడ్ బ్రేకర్ రావడంతో కారు వేగం తగ్గించారు. ఈ సమయంలో వెనుకవైపు నుంచి వస్తున్న గాండ్లవారిపల్లికి చెందిన ఈశ్వరయ్య బైక్‌పై వచ్చి వెనుక నుంచి కారుకు తగిలించాడు. దీంతో ఇన్నోవాలో ఉన్న ఐదుగురు యువకులు ఈశ్వరయ్యను చితకబాదారు. వాహనం దెబ్బతినిందని బలవంతంగా ఫోన్‌పే ద్వారా డబ్బు తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. అనంతరం వేగంగా వస్తూ ముదిగుబ్బలోని ఆంధ్ర బ్యాంకు సమీపంలో నిలిచి ఉన్న ఆటోను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అప్పటికే విషయం తెలుసుకున్న పోలీసులు అనంతపురం వైపు వెళుతున్న వాహనాన్ని కేజీబీవీ వద్ద అడ్డగించారు. వాహనాన్ని తనిఖీ చేసి 250 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. యువకులు మత్తులో ఉండటంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

మానవత్వం చాటుకున్న ఇన్‌స్పెక్టర్



వృద్ధుణ్ని అనాథాశ్రమానికి తరలిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అచేతనంగా పడి ఉన్న ఓ వృద్ధుణ్ని ఆర్టీసీ సెక్యూరిటీ జిల్లా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఓ అనాథాశ్రమానికి పంపి మానవత్వాన్ని చాటుకున్నారు. గత కొన్ని రోజులుగా ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఓ వృద్ధుడు తలదాచుకుంటున్నాడు. కనీసం భోజనం కూడా తెచ్చుకోలేని నిస్సహాయస్థితి. శుక్రవారం అతన్ని గమనించిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు వివరాలు ఆరా తీశారు. నగరానికి చెందిన బీఎస్ ఉస్మాన్ అని తెలుసుకుని ఆయన కుమారులను సంప్రదించారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో బెరాకా వృద్ధాశ్రమం నిర్వాహకుడు శ్రీరాములకు సమాచారం ఇచ్చారు. అతను వచ్చి వృద్ధుణ్ని అనాథాశ్రమానికి తీసుకెళ్లారు.

అభాగ్యురాలికి 'అమ్మ' సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: కష్టాల్లో కూరుకుపోయిన ఓ అభాగ్యురాలికి 'అమ్మ' సంస్థ సాయమందించింది. కంబదూరు మండలం ములకనూరుకు చెందిన పరంధాముడు చనిపోగా.. ఆయన భార్య వెంకటలక్ష్మి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఆమె కుమార్తె సుగుణ పుట్టుకతోనే దివ్యాంగురాలు. దానికి తోడు వెంకట లక్ష్మి కూడా అనారోగ్యం బారిన పడింది. ఆమె పరిస్థితి 'అమ్మ' సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల రమణారెడ్డి దృష్టికి రావడంతో ఆయన స్పందించి శుక్రవారం రూ.40 వేల ఆర్థికసాయాన్ని చెక్కు రూపంలో అందించారు. భవిష్యత్తులోనూ అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ డబ్బుతో చిన్న అంగడి పెట్టుకుని జీవనాన్ని కొనసాగిస్తామని వెంకటలక్ష్మి తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్ షాపులపై కొరడా

- అధిక ధరలకు విక్రయాలు
- సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ తనిఖీలో వెల్లడి
- 40 షాపులపై కేసుల నమోదు

అనంతపురం సెంట్రల్: అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని షాపులపై సెక్యూరిటీ జిల్లా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు కొరడా ఝుళిపించారు. అధిక ధరలకు తినుబండారాలను విక్రయించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన షాపుల యజమానులపై కేసులు నమోదు చేశారు. ఆయన శుక్రవారం బస్టాండులోని 70 షాపులను తనిఖీ చేశారు. ధరలపై ఆరా తీశారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తేలింది. అలాగే నిర్దేశించిన స్థలం కంటే ముందుకు వచ్చి విక్రయాలు చేస్తున్న విషయాన్ని గుర్తించారు. దీంతో 40 షాపుల యజమానులపై కేసులు నమోదు చేశారు. నివేదికను ఆర్టీసీ డిపో మేనేజర్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. నిబంధనల ఉల్లంఘన కింద డిపో మేనేజర్ జరిమానాలు విధిస్తారన్నారు.

32 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల నిర్వాహకులు

అనంతపురం రూరల్: నందు టెక్ మహీంద్ర కంపెనీ ఆధ్వర్యంలో బాలాజీ ఎంసీఏ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో 32 మందికి ఉద్యోగాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మన్మథేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు చెన్నైలో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికై న వారిని కళాశాల చైర్మన్ పల్లె కృష్ణకిశోర్, డైరెక్టర్ పల్లె సింధూరరెడ్డి అభినందించారు.

విద్యాసామగ్రి అందజేత

అనంతపురం క్రైం: అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్స్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఐఎంఏ హాలులో హెచ్ఐవీ ప్రభావిత కుటుంబాల పిల్లలకు విద్యా సామగ్రిని అందజేశారు. ముఖ్యఅతిథిగా తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి మాట్లాడుతూ హెచ్ఐవీ ప్రభావిత కుటుంబాల పిల్లలపై వివక్ష చూపకూడదన్నారు. ఏజీ శ్రీనివాస్‌రెడ్డి సంస్థ అధ్యక్షులు ఏజీ ప్రమీలమ్మ మాట్లాడుతూ పిల్లలందరూ ఆత్మస్థైర్యంతో జీవించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్స్ అధ్యక్షుడు వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిగేషన్‌తో అధిక ఉద్యాన దిగుబడులు



మాట్లాడుతున్న వైవీఎస్ మూర్తి, వేదికపై ఉద్యాన కళాశాల డీన్ నారాయణరెడ్డి, డీహెచ్‌వో రఘునాథరెడ్డి తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్ పద్ధతిలో నేరుగా పంటలకు పోషకాలు అందించే ఫర్టిగేషన్ విధానం అవలంభిస్తే ఉద్యాన పంటల్లో దిగుబడి పెరుగుతుందని ది ఫర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సౌత్ రీజియన్ వైస్ ప్రెసిడెంట్ వైవీఎస్ మూర్తి, శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాల డీన్ నారాయణరెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి (డీహెచ్‌వో) బి.రఘునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో ఫర్టిగేషన్, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపై ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది, ఎరువుల కంపెనీ ప్రతినిధులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రకాల పండ్ల తోటలు, కూరగాయల పంటల్లో డ్రిప్, స్ప్రింక్లర్లు (బిందు, తుందర) పరికరాలు తప్పనిసరిగా బిగించుకోవడంతో పాటు ఫర్టిగేషన్ పద్ధతిలో పంటలకు అవసరమైన మోతాదులో ఎరువులు అందించాలన్నారు. ఈ విధానం వల్ల నీరు, పోషకాలు ఒకేసారి అందుతాయన్నారు. ఫర్టిగేషన్‌కు ఎలాంటి ఎరువులు, ఎపుడు, ఎలా వాడాలనే దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ ఏడీ నరసింహారావు, హెచ్‌వో రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాంక్రమిక వ్యాధుల వివరాలు పంపాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ వీరబ్బాయి

రాప్తాడురూరల్: జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రులకు వచ్చే సాంక్రమిక, గుర్తింపు పొందిన వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ రోజూ వైద్యశాఖకు సమాచారం పంపాలని యాజమాన్యాలను డీఎంహెచ్ఓ వీరబ్బాయి ఆదేశించారు. శుక్రవారం నగరంలోని అమరావతి, చంద్ర సూపర్ స్పెషాలిటీ, కేర్ అండ్ క్యూర్, క్రాంతి ఆస్పత్రులను డీఎంహెచ్ఓ పరిశీలించారు. సమాచారం నమోదు చేసే విధానంపై ఏపీ డమాలజిస్ట్ వేణుతో కలిసి అక్కడ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలోని గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు సంక్రమిత, గుర్తింపు పొందిన వ్యాధులపై జిల్లా కేంద్రానికి సమాచారం పంపాలని ఆదేశించారు. తద్వారా గ్రామ, పట్టణ స్థాయిలో వ్యాధులు గుర్తింపు, తీవ్రతను అంచనా వేసి, వ్యాప్తిని తగ్గించేందుకు సులభతరం అవుతుందన్నారు. గతంలో ఈ వ్యాధుల గుర్తింపు కేవలం ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రమే జరిగేదన్నారు. ఇప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రతి ప్రైవేట్ ఆస్పత్రి నుంచి సమాచారం తప్పకుండా పంపాలన్నారు.

రాధా పార్థసారథుల ప్రేమ అజరామరం

- ఇస్కాన్ జీబీసీ చైర్మన్ రేవంత్ రమణ ప్రభుపాదులు



రేవంత్ రమణ ప్రభుపాదులతో ఇస్కాన్ ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: రాధా పార్థసారథుల ప్రేమ అజరామరమని, లోకానికి ఆదర్శమని ఇస్కాన్ జీబీసీ (గవర్నింగ్ బాడీ కమిటీ) చైర్మన్ రేవంత్ రమణ ప్రభుపాదులు అన్నారు. నగరంలో జరగనున్న పూరీ జగన్నాథ రథయాత్ర కోసం శుక్రవారం అనంతకు వచ్చిన ఆయనకు ఇస్కాన్ ప్రతినిధులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్థానిక ఇస్కాన్ గోశాలలో శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సోములదొడ్డిలోని ఇస్కాన్ మందిరానికి చేరుకుని రాధాపార్థసారథులకు చందన అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జగన్నాథ రథాన్ని ఏపీ ఎండోమెంట్ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, టీటీడీ ధార్మిక మండలి అధ్యక్షుడు శ్రీపాద వేణుతో కలిసి ప్రారంభించారు. కృష్ణతత్వం, జగన్నాథ రథ ప్రాశస్త్యం గురించి అనుగ్రహభాషణం చేశారు.

బిక్కి కృష్ణకు పైడి లక్ష్మయ్య సాహితీ పురస్కారం



బిక్కి కృష్ణ

అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన సాహితీవేత్త, విలువలు కలిగిన రాజకీయ నేత డాక్టర్ పైడి లక్ష్మయ్య పేరిట అందించే స్మారక పురస్కారాన్ని ఈసారి ప్రముఖ కవి, విమర్శకులు బిక్కి కృష్ణకు అందిస్తున్నారు. ఈ మేరకు రసమయి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎంకే రాము వివరాలు అందించారు. సినీ గేయ రచయితగా, బహుగ్రంథకర్తగా, డిక్షన్ లాంటి కవిత్వాన్ని సాహితీ లోకానికి అందించిన అనంత కవి బిక్కి కృష్ణ ఈ నెల 24న హైదరాబాద్‌లో పురస్కారం అందుకుంటారు. గతంలో పుట్టపర్తి నారాయణాచార్యులు, రావూరి భరద్వాజ, డాక్టర్ బోయి భీమన్న వంటి లబ్ధప్రతిష్టులు అందుకున్న డాక్టర్ పైడి లక్ష్మయ్య అవార్డును విశ్రాంత గవర్నర్ రామమోహనరావు, కొలకలూరి ఇనాక్ చేతుల మీదుగా అందుకోబోతున్న బిక్కి కృష్ణకు అనంత జిరసం ప్రతినిధులు శ్రీహరి, నాగరాజు, గుత్తా హరి అభినందనలు తెలిపారు.

గురుబ్రహ్మ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: గురుబ్రహ్మ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ అకాడమీ వ్యవస్థాపకులు ఈఎస్ఎస్ నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యారంగమే కాకుండా వివిధ రంగాల్లోని గురువులు అవార్డులకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 30 లోపు దరఖాస్తులను ×సర్వేజనా సుఖినోభవంతు, డోర్‌నం. 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్ -15₹ చిరునామాకు పంపాలన్నారు. అవార్డుకు ఎంపికైన వారికి వచ్చేనెల 9న హైదరాబాద్‌లో ×గురువులకు వందనం₹ పేరుతో నిర్వహించే సభలో పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్: 9652347207లో సంప్రదించాలన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో నాట్స్ సేవలు

అనంతపురం టవర్‌క్లాక్: తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా సేవలు చేసేందుకు నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) సిద్ధంగా ఉందని ఆ సొసైటీ అధ్యక్షుడు బాపయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సొసైటీ 2009లో ఏర్పాటైందని, అప్పటి నుంచి తెలుగు వారి సంక్షేమమే ధ్యేయంగా, తెలుగు భాష పరిరక్షణ లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా అనంతపురం జిల్లాలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)తో కలిసి పలు కార్యక్రమాలు చేసేందుకు మాంఛో ఫెర్రర్‌తో చర్చించామన్నారు. మన గ్రామం.. మన బాధ్యత నినాదంతో తెలుగు రాష్ట్రాల్లో గ్రామాల అభివృద్ధికి చేయూతనిస్తున్నామన్నారు. అమెరికాలోని తెలుగువారి సంరక్షణ కోసం 24 గంటలూ అందుబాటులో ఉండేలా 1888-4 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై 30న ధర్నా

అనంతపురం అర్బన్: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈ నెల 30న స్థానిక పవర్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్, సీపీఐ ఎంఎల్ (ఎన్‌డీ) జిల్లా కార్యదర్శులు రాంభూపాల్, జాఫర్, పెద్దన్న, ప్రభాకర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ చార్జీలపై ఈ నెల 27న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. అలాగే 30న చేపట్టే ధర్నాలోనూ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

రైతు సమస్యలపై..

రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 30న విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం (సీపీఎం) నాయకులు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో మహాధర్నా పోస్టర్లను జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు విడుదల చేశారు.

'మట్టి' పరీక్షలతో అధిక దిగుబడులు



గొల్లపల్లిలో మట్టి నమూనా సేకరణను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

రాప్తాడు: మట్టి పరీక్షలు చేయించుకుని ఫలితాల ఆధారంగా పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరి తెలిపారు. శుక్రవారం ఆమె రాప్తాడులో సబ్సిడీ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం వ్యవసాయ సిబ్బందితో కలసి గొల్లపల్లి గ్రామంలో పర్యటించారు. మట్టి నమూనా సేకరణ విధానాన్ని తనిఖీ చేశారు. ఆమె వెంట ఏఓ వెంకటేశ్వరప్రసాద్, ఏఈఓ రంజిత, ఆర్‌బీకే సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన

కనగానపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని తగరకుంట, కనగానపల్లి గ్రామాల్లో శుక్రవారం ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ సదస్సులు నిర్వహించారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ అలివేలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, యూత్ కన్వీనర్ అశోక్, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేద్దాం

కనగానపల్లి: బాల్య వివాహాలకు పూర్తిగా అడ్డుకట్ట వేసి ఆడ పిల్లల భవితకు బంగారు బాటలు వేద్దామని మహిళాశక్తి సొసైటీ అధ్యక్షురాలు వహీదా పిలుపునిచ్చారు. శుక్రవారం మండల శివపురం గ్రామంలో మహిళా శక్తి సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మహిళా చట్టాలు, గృహ హింస, బాల్య వివాహాల నిషేధంపై ప్రజలకు నాటకాల రూపంలో ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో టింబక్టు కలెక్టివ్ ప్రోగ్రాం మేనేజర్ సుకన్య, సీఈఓ రజనీ, పలువురు సభ్యులు పాల్గొన్నారు.